# దేవుడు చెప్పాలా?



## కథ

**వాణిశ్రీ**

హర్ష బైక్, స్టాండ్‌లో పెట్టి ఆఫీసులోకి అడుగుపెడుతూ వుండగా సెల్ రింగైంది.

''హలో మంజూ! ఆఫీస్ ఎంట్రన్స్‌లో వున్నాను. వచ్చేస్తున్నా'' అన్నాడు.

''హర్షా! నేను ఆఫీసులో లేను. జయా హాస్పిటల్లో వున్నాను. నువ్వు అర్జెంట్‌గా రా'' అన్నది మంజు.

''అర్జెంటా? మేటరేంటి?''

''రా చెప్తాను. ఫోన్‌లో చెప్పేది కాదు''

''ఎక్కడికి రమ్మంటావు? హాస్పటల్‌కా?''

''నో...నో... మా ఫ్లాట్‌కి రా. నేను హాస్పిటల్ నుంచి బయల్దేరుతున్నాను''

హర్ష లీవ్ లెటర్ ఇచ్చి మంజు ఫ్లాట్‌కి బయల్దేరాడు. అతను వెళ్లేసరికే మంజు ఫ్లాట్‌లో అతని కోసం ఎదురుచూస్తోంది. ఆమె ఎందుకో ఆందోళన పడుతున్నట్టు కనిపించింది. అతను వెళ్లి సోఫాలో కూర్చున్నాడు. మంజు అతని పక్కనే కూర్చుని ముఖం అతని ఛాతీకి ఆనించి కళ్లు మూసుకుంది. హర్ష ఆమె వీపు నిమురుతూ కూర్చున్నాడు.

''మంజూ!''

''వూ...''

''వాటీజ్ ద మేటర్? వర్రీగా వున్నావెందుకు?''

''డాక్టర్ ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ చేసింది''

హర్ష నెత్తిన పిడుగు పడ్డట్టయింది.

''వాట్?'' అన్నాడు.

''యస్ హర్షా''

హర్ష కొంచెంసేపు మౌనంగా వుండిపోయాడు. తను ఎల్లుండి చెన్నయ్ వెళ్తున్నాడు. అమెరికన్ కాన్స్‌లేట్‌లో వీసా కోసం ఇంటర్వ్యూ వుంది. ఇప్పుడీ బెడద ఏమిటి? ఆలోచనలో పడిపోయాడు.

''హర్షా! మన పెళ్ళి వెంటనే జరిగిపోవాలి'' అన్నది మంజు.

''అదెట్లా కుదురుతుంది మంజూ? ఎల్లుండి చెన్నయ్ వెళ్తున్నానని చెప్పాను కదా! వీసా రాగానే యుయస్ వెళ్తున్నాను''

''వెళ్తే వెళ్ళు. పెళ్ళి దానికి అడ్డమా?'' ప్రశ్నించింది మంజు.

''అడ్డమే కదా! నేను అక్కడికెళ్లాక నీకు ఇక్కడ ఎలా వుందో? అని వర్రీగా వుంటుంది. ఐనా హడావిడిగా పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టం లేదు''

''ఐతే ఇప్పుడేమంటావు? నన్నేం చేయమంటావు?'' అతనికి దూరంగా జరిగి అన్నది మంజు.

''ప్లీజ్ మంజూ! హర్ట్ కావొద్దు. అబార్షన్ చేయించుకో'' కూల్‌గా అన్నాడు హర్ష.

దెబ్బతిన్నట్టు చూసింది మంజు. ఆమెకు అతని విషయం బాగా తెలుసు. ఒకసారి ఏదైనా నిర్ణయం తీసుకుంటే దాన్ని మార్చుకోడు. మొండిగా వుంటాడు. అతనితో వాదించడం అనవసరం. అతను తన కెరీర్ డెవలప్ చేసుకునే ప్లాన్‌లో వున్నాడు. తను ఏమైపోయినా పట్టించుకోడు.

ఆమె విసురుగా లేచి బెడ్‌రూంలోకి వెళ్ళి తలుపులు మూసుకుంది.

★ ★ ★

హర్ష కోసం రూంలో ఎదురుచూస్తున్నాడు వంశీకృష్ణ. రేపు ఇద్దరూ చెన్నయ్ వెళ్తున్నారు వీసా కోసం. ఈరోజు చిలుకూరు బాలాజీ గుడికెళ్ళి ప్రదక్షిణాలు చెయ్యాలి. ఈ దేవుడు వీసాలు మంజూరు చేయిస్తాడని ఒక నమ్మకం. అందుకే వీసాల బాలాజీ అన్నారు.

కాసేపటికి హర్ష వచ్చాడు.

''మంజుకి ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయింది. వెంటనే పెళ్లి జరగాలని గొడవ. నో చెప్పాను. అబార్షన్ చేయించుకోమన్నాను'' చెప్పాడు హర్ష.

''ఏమంది? తను ఒప్పుకుందా?'' అడిగాడు వంశీకృష్ణ.

''తనకి ఇష్టం లేదు''

''ఇప్పుడేం చేస్తావు?''

''చేసేదేముంది? ఇప్పుడు పెళ్లేంటి? కెరీర్ ముఖ్యం కదా''

''అటువంటప్పుడు తొందరపడ్డావెందుకు? ఆమాత్రం తెలీదా?''

''ఏమిటో ఒక్కోసారి అలా జరిగిపోతూ వుంటుంది'' అని నవ్వాడు హర్ష.

''మంజు హర్ట్ అవుతుందేమో?''

''ఐతే అవుతుంది. నేనేం చేస్తాను. యుయస్‌లో మన ఆఫర్ వదులుకోవడం తెలివితక్కువతనం''

''దానికీ దీనికీ ఏం సంబంధం?''

''ఉందిలే. పెళ్లి చేసుకుని వెళ్తే అక్కడ మన పని జీరో''

''వాట్?''

''ఆ కంపెనీ రెలెటివ్ ఒకమ్మాయిని అక్కడ పెళ్లి చేసుకోవాలని ఒప్పందం. లేకపోతే అందరికీ జాబ్స్ వూడుతున్న టైంలో మనకి ఆఫర్ ఎలా వచ్చిందనుకున్నావ్?'' చెప్పాడు హర్ష.

''మరి మంజు?'' ఆశ్చర్యంతో అడిగాడు వంశీకృష్ణ.

''ఎవరి దారి వాళ్లది! ఏదో కొన్నాళ్లు డేటింగ్ చేశాం. దట్సాల్'' నవ్వాడు హర్ష.

అతని నవ్వులో క్రూరత్వం కనిపించింది వంశీకృష్ణకు.


అతని గురించి ఒక కొత్తకోణం వెలుగులోకి

వచ్చింది. యూజ్ అండ్ త్రో పాలసీ వంట పట్టించుకున్నాడు హర్ష.

''అదేంటి హర్షా! మంజు నిన్ను డీప్‌గా లవ్ చేస్తున్నది కదా! పెళ్లి చేసుకుంటావని నమ్మింది. అందుకే నీకు స్వేచ్ఛ ఇచ్చింది. ఇప్పుడు కాదు పొమ్మంటే షాక్ తింటుంది'' అన్నాడు వంశీ కృష్ణ.

''నువ్వన్నమాట నిజమే! సడన్‌గా నీకూ నాకూ సంబంధం లేదంటే షాక్ తింటుంది. సూసైడ్ చేసుకునే ప్రమాదం కూడా వుంది. అందుకనే ముందు అబార్షన్ చేయించుకోమన్నాను. అప్పుడు తను సేఫ్ కదా! నేను అమెరికా వెళ్లిపోయాక కొన్నాళ్లు టచ్‌లో వుంటాను. తర్వాత నెమ్మదిగా నన్ను మర్చిపోవడం ప్రారంభిస్తుంది'' చెప్పాడు హర్ష.

హర్ష ఆలోచన వంశీ కృష్ణకి దారుణం అనిపించింది. పెళ్లి కాకుండా తల్లి అయ్యే



పరిస్థితి మంజు కొనితెచ్చుకున్నదే కావొచ్చు). తప్పు ఇద్దరిదీ అయినా శిక్ష మంజు అనుభవించ వలసిందేనా?

హర్ష పొరపాటున తప్పు చేస్తే? అది వేరు. కావాలని తప్పు చేస్తే? తన కెరీర్ కోసం నమ్మిన వారిని దారుణంగా మోసం చేస్తే? దేవుడు ఇటువంటి వారిని శిక్షించడా? వంశీకృష్ణకి మంజు అమాయకమైన ముఖం కళ్లముందు కదలాడి అతని మనసు వికలమైంది.

''నీకు దేవుడి మీద నమ్మకం వుందా?'' ప్రశ్నించాడు వంశీకృష్ణ.

ఉలిక్కిపడ్డాడు హర్ష. అయోమయంగా వంశీకృష్ణ ముఖంలోకి చూశాడు.

''ఎందుకట్లా అడిగావ్? నమ్మకం వుండబట్టే గదా! ఇప్పుడు మనం చిలుకూరు వెళ్తున్నాం'' అన్నాడు హర్ష.

''ఏం లేదు. వూరికినే'' అన్నాడు వంశీకృష్ణ.

''ఇక బయల్దేరుదామా?'' అడిగాడు హర్ష.

''బైక్ నేను నడుపుతాలే'' అన్నాడు వంశీకృష్ణ.

హర్ష తల వూపాడు. వంశీకృష్ణ బైక్ స్టార్ట్ చేశాడు. హర్ష అతని వెనుక కూర్చున్నాడు.

కొంత దూరం పోయాక వర్షం మొదలైంది. రోడ్డు మీద పడిన గుంతలో నీళ్లున్నాయి. స్పీడ్‌గా వెళ్తున్న బైక్ ఎగిరి పడింది. వెనుక కూర్చున్న హర్ష వెనక్కి పడిపోయాడు. తలకి దెబ్బ తగిలి స్పృహ తప్పిపోయాడు. బైక్ నడుపుతున్న వంశీకృష్ణ పక్కకి పడ్డాడు. కానీ దెబ్బలేం తగల్లేదు. మోకాలు దగ్గర కొంచెం చర్మం గీరుకుపోయింది.

★ ★ ★

హర్ష తలకి దెబ్బ తగలడమే కాదు, ఎడమకాలు విరిగింది. హాస్పిటల్‌లో ఆపరేషన్ చేసి కట్టుకట్టారు. కనీసం నాలుగు నెలలు బెడ్‌రెస్ట్ తీసుకోవాలని డాక్టర్ చెప్పాడు. చెన్నయ్‌కి వెళ్లే ప్రోగ్రామ్ క్యాన్సిల్ అయింది. హర్ష అమెరికా కలలు పగటి కలలయ్యాయి.

''నీకు దేవుడి మీద నమ్మకం వుందా?'' అడిగాడు వంశీకృష్ణ.

హర్షకి మండింది. 'ఇదివరకొకసారి అదే ప్రశ్న అడిగాడు. ఇప్పుడు మళ్లీ అడుగుతున్నాడు. అందరూ దేవుణ్ణి నమ్మేవాళ్లే కదా! ఎవరో కొందరు తప్ప. వాడికా అనుమానం ఎందుకో?' అని పళ్లు కొరుక్కున్నాడు.

''ఇదివరకొకసారి చెప్పాను కదా'' కోపంగా అన్నాడు హర్ష.

''గుర్తుంది''

''మరి?''

''దేవుడు భక్తుల్ని పరీక్షిస్తాడని కొన్ని కథలున్నాయి తెలుసా?''

''తెలుసు''

''అదే చెప్తున్నా! నీకు తన మీద నిజంగా నమ్మకం వుందో లేదో అని దేవుడు నిన్ను పరీక్షిస్తున్నాడని ఎందుకు అనుకోవు?''

హర్ష అయోమయంగా చూశాడు.

''మా నాయనమ్మ చిన్నప్పుడు చెప్పింది. దేవుడి భక్తులు ఎవరికైనా చేయగలిగితే సహాయం చేయాలి. మేలు చేసిన వారిని రక్షిస్తాడు. ఎవరికీ అపకారం చేయకూడదు. అలా చేస్తే శిక్షిస్తాడు'' చెప్పాడు వంశీకృష్ణ.

''నువ్వు అనేది ఏంటి? నేనెవర్ని మోసం చేశాను?'' హర్ష ముఖం ఎర్రగా అయింది.

వంశీకృష్ణ నవ్వాడు.

''నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించి నమ్మిన మంజుని మోసం చేయలేదా?'' సూటిగా అడిగాడు వంశీకృష్ణ.

హర్ష దెబ్బతిన్నట్టు వంశీకృష్ణవైపు చూశాడు. ఎవరో చెంపమీద కొట్టినట్టు ఉలిక్కిపడ్డాడు.

''గాడ్ ప్రామిస్‌గా చెప్పు. మంజుని నువ్వు మోసం చెయ్యాలని చూడలేదూ? అది అన్యాయం కాదా?''

హర్ష తల వంచుకున్నాడు.

''హర్షా! సరిగ్గా మనం దేవుడి దగ్గరకు వెళ్తున్నప్పుడే ఈ యాక్సిడెంట్ ఎందుకు జరిగింది? బైక్ నడుపుతున్న నాకు ఏం కాలేదు. నీకే కాలు ఎందుకు విరిగింది?''

వంశీకృష్ణ మాటలు అతని గుండెకు బులెట్స్‌లా తాకుతున్నాయి. ఆలోచనలో పడిపోయాడు.



ఇంతలో నర్స్ వచ్చింది. జబ్బ మీద ఇంజెక్షన్ చేసి వెళ్లింది.

'తను హర్షను దేవుడి సెంటిమెంట్‌తో కొట్టినందుకు ఏదైనా ఫలితం కనిపిస్తుందా?' అని ఆలోచిస్తున్నాడు వంశీకృష్ణ.

''నాకు యాక్సిడెంట్ జరిగిందని మంజుకి తెలుసా?'' అడిగాడు హర్ష.

''ఏమో?'' పెదవి విరిచాడు వంశీకృష్ణ.

''నువ్వు చెప్పలేదా?''

''ఊహూ.. నీకిష్టం వుండదేమోనని...'' నీళ్లు నమిలాడు.

హర్ష సెల్ తీసుకుని మంజుకి రింగ్ చేశాడు.

''మంజూ ఎక్కడున్నావు? ఆఫీసులోనేనా?'' అడిగాడు హర్ష.

''లేదు. లీవ్ పెట్టాను. ఇప్పుడు జయా హాస్పిటల్‌కి వెళ్తున్నాను'' చెప్పింది మంజు.

''ఎందుకు?''

''అదేంటి ఏం తెలియనట్టు అడుగుతావు? నువ్వేగా అబార్షన్ చేయించుకోమన్నావు? అందుకే వెళ్తున్నాను''

''నో...నో... ప్లీజ్ వద్దు మంజూ! నాకు యాక్సిడెంట్ అయింది. లెఫ్ట్ లెగ్ ఫ్రాక్చరైంది. ఆపరేషన్ చేశారు. ఫోర్ మంత్స్ బెడ్‌రెస్ట్. అమెరికా ప్రోగ్రామ్ కాన్సిల్. ఒక నెలలో కాస్త రిలీఫ్ వుంటుంది. అప్పుడే మేరేజ్ చేసుకుందాం. నువ్వు వర్రీ కాకు'' చెప్తున్నాడు హర్ష.

వంశీకృష్ణ సంతృప్తిగా నవ్వుకున్నాడు.

★

## డైమండ్ నెక్లెస్‌ల మోజు!

**నగలంటే మోజు పడని ఆడవాళ్లుంటారా? అందునా సినిమా హీరోయిన్ అంటే చెప్పేదేముంది? అఫ్‌కోర్స్, నేటి తరం యువతులు ఎక్కువగా ఫ్యాన్సీ ఆభరణాల్నే ఇష్టపడుతుంటారు. అయితే ఛార్మి మాత్రం వజ్రాభరణాలంటే భలే ఇదట. డైమండ్ నెక్లెస్‌లు ధరించడం అంటే భలే ఉత్సాహపడుతుందట. ఏదైనా జ్యుయలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి పిలిస్తే ఎగిరి గంతేసి ఒప్పేసుకుంటుందిట ఛార్మి. ఎందుకంటే అక్కడ బోలెడన్ని వెరైటీ హారాలను చూడొచ్చు కదా! బానే వుంది, నచ్చినవన్నీ సొంతం చేసుకోగలమా ఎవరమైనా?**